సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 19 । ఏప్రిల్ । 2025



పొన్నూటిపాళ్యంలో టెన్షన్..టెన్షన్

వేటగాళ్ల ఉచ్చులో చిరుతపులి మృతి చెందిన ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో...శుక్రవారం పొన్నూటిపాళ్యం గ్రామంలో టెన్షన్ నెలకొంది. -10లో



'ఎర్రచందనం' మాయంపై ఏసీబీ కేసు

వనిపెంట అటవీ రేంజ్ గోడౌన్ నుంచి 37 దుంగలు మాయమయ్యాయి. ఇందుకు సంబంధించి 15 మంది అటవీ అధికారులపై ఏసీబీ కేసు నమోదు చేసింది. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 219 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మెడికల్ అండ్ హెల్త్ డీడీగా శేఖర్

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా శేఖర్ నియమితులయ్యారు. ఈయన కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న భక్తవత్సలం పదోన్నతిపై ఏపీ రిక్రూట్‌మెంట్ బోర్డు జాయింట్ డైరెక్టర్‌గా వెళ్లారు. దీంతో ఈ స్థానంలోకి శేఖర్ వస్తున్నారు.

అంతర్జాతీయ కవిసమ్మేళనానికి ఆహ్వానం



జనార్దనరాజు

రాజంపేట: హైదరాబాదులోని చిక్కడపల్లి త్యాగరాయగానసభలో మే8న నిర్వహించే అంతర్జాతీయ కవిసమ్మేళనానికి అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకకు చెందిన కవి బాలరాజు జనార్ధనరాజుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణా తెలుగు భాష చైతన్యసమితి 12వవార్షికోత్సవం సందర్భంగా తెలుగుభాషకు పట్టాభిషేకం పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఇందులో కవితా ధోరణి వినిపించడానికి అన్ని దేశాల్లోని తెలుగు కవులు వారి వారి పేర్లను నమోదు చేసుకునేందుకు ఆహ్వానం పంపినట్లు వివరించారు. కాగా జనార్ధనరాజు ఇప్పటికే మూడు కవి సమ్మేళనాల్లో పాల్గొని కవితలను వినిపించారు. బాలరాజు జనార్ధనరాజును తాళ్లపాకవాసులు అభినందించారు.

దంత సంరక్షణపై అవగాహన



దంతవైద్య కళాశాల ఆవరణలో దంత సంరక్షణపై వైద్య విద్యార్థుల ప్రదర్శన

కడప అర్బన్: వరల్డ్ ఓరల్ హెల్త్ డే మార్చి 20 సందర్భంగా డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రాం వారిచే నిర్వహించే వివిధ నోటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్లో కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాల వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. నెల రోజులు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగా వాకతాన్ చేశారు. పుచ్చిన పళ్ల సమస్యలు, దంతాల సంరక్షణతోపాటు గుట్కా, కైని, పొగాకు, మందు మొదలగునవి అరికట్టే విధానం ప్రాథమిక దశలో రోగనిర్ధారణ చేయగలిగిన పరికరాలు, నోటి క్యాన్సర్‌పై ప్రజలలో అవగాహన కల్పించారు. నోటి ఆరోగ్యం, శరీర ఆరోగ్యం ఎలా సంరక్షించుకోవాలో ముందుగా దంత వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించడానికి వాళ్లకు వివిధ పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా స్లోగన్, రైటింగ్, పెయింటింగ్, డెంటల్ ఫోటోగ్రఫీ నిర్వహించారు. ఏప్రిల్ 9న వాకతాన్ మహావీర్ సర్కిల్ నుంచి బస్టాండ్ వరకు సాయంత్రం 6 నుంచి 7 గంటల సమయంలో యూజీ, పిజి దంత వైద్య విద్యార్థులు, స్టాఫ్ పాల్గొన్నారు. ఏప్రిల్ 17న గ్రూప్ టూత్ బ్రెషింగ్ పద్ధతి, నోటి ఆరోగ్యం అవగాహన ప్రజల్లో దంత సంరక్షణ అవగాహన కల్పించారు.



గడ్డికి గడ్డు కాలం!

- మండుతున్న గ్రాసం ధరలు
- వరిగడ్డి, వేరుశనగ పొట్టుకు డిమాండ్
- కిలో రూ. 8 నుంచి రూ.10

గుర్రంకొండ: జిల్లాలో పాడిరైతులకు అవసరమైన గడ్డికి గడ్డుకాలం వచ్చిపడింది. ప్రస్తుతం పాడి ఆవులకు గడ్డి దొరకడం కష్టంగా మారింది.భగ్గుమంటున్న గడ్డి ధరలు పాడిరైతులుకు మోయలేని భారంగా మారింది. ప్రస్తుతం వరిగడ్డి కిలో రూ.8 నుంచి రూ.12 వరకు ధరలు పలుకుతున్నాయి. వేరుశనగ పొట్టు లోడు రూ. 20 వేల నుంచి రూ.25 వేల వరకు ధర ఉంది.దీంతో పశుగ్రాసానికి డిమాండ్ ఏర్పడింది. జిల్లాలో పాడిపశువులకు ప్రతి రోజు 7,128 టన్నుల గడ్డి అవసరం ఉంది. పాలపై వచ్చే ఆదాయం సగ భాగం పశుగ్రాసం కొనడానికే సరిపోతోంది. దీంతో పాడిరైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

గడ్డి కోసం రోజుకు రూ.8.52 కోట్ల ఖర్చు

జిల్లాలో పాడిరైతులు పశుగ్రాసం కోసం ప్రతిరోజు రూ. 8.52 కోట్ల మేరకు ఖరు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కిలో ఎండుగడ్డి ప్రస్తుతం రూ. 8 నుంచి రూ.10 వరకు ధరలు పలుకుతున్నాయి. గతంలో ట్రాక్టర్లు, లారీల్లో లోడ్ల కింద జమకట్టి గడ్డిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం రోల్స్ రూపంలో ఎండుగట్టిని బయట ప్రాంతాలనుంచి వ్యాపారులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఒకరోల్ లో 25కిలోల మేరకు గడ్డి ఉంటుంది. ప్రస్తుతం ఒకరోల్ ధర రూ. 180 నుంచి రూ.200 వరకు ధరలు పలుకుతున్నాయి. దీనికితోడు మొక్కజొన్న,జొన్న పచ్చిగడ్డి, ఉలవపొట్టు, వేరుశనగ పొట్టును పాడిరైతులు కొనుగోలు చేస్తున్నారు. అన్ని కలుపుకుంటే ఒక రోజుకు పాడి ఆవుకు రూ. 100 నుంచి రూ.150 వరకు పశుగ్రాసం కోసం ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందని పాడిరైతులు ఆవేదన చెందుతున్నారు. ఫీడు, ఇతరత్రా మందుల ఖర్చు కలుపుకొంటే పశుపోషణ తడిసిమోపెడవుతోందని చెబుతున్నారు.



బయట జిల్లాల నుంచి దిగుమతి అవుతున్న గడ్డి లోడు

భారంగా మారిన పశపోషణ

రోజురోజుకు పశుపోషణ భారంగా మారుతోందని పాడిరైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వరిగడ్డి, వేరుశనగ పొట్టుకు డిమాండ్ ఏర్పడడంతో వైఎస్సార్ జిల్లా నుంచి ప్రతిరోజు ఎండుగడ్డిని దిగుమతి చేసుకుంటున్నారు. పచ్చిగడ్డికి తోడు వరిగడ్డిని వినియోగించడం వల్ల పాల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని పాడిరైతుల నమ్మకం. దీంతో పచ్చిగడ్డి ఉన్నా ఎండు వరిగడ్డి, వేరుశనగ పొట్టుపై ఆసక్తి చూపిస్తున్నారు. నెలరోజుల క్రితం కిలో ఎండు వరిగడ్డి రూ. 5 ఉండేది. ప్రస్తుతం దళారులు ధరలు విపరీతంగా పెంచేసి రూ. 8 నుంచి రూ.10 వరకు పాడిరైతుల దగ్గర నుంచి వసూలు చేస్తున్నారు. రెండున్నర సెంట్ల పొలంలో ఉన్న మొక్కజొన్నలు రూ. 2వేలకు, జొన్నలు రూ.1000, వేరుశనగ పొట్టు లోడు రు.25 వేల వరకు ఖర్చు చేసి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వేధిస్తున్న పశుగ్రాసం కొరత

గత ఐదేళ్లు పాడిఆవులకు గడ్డి కొరత రాలేదు. ఎక్కడ చూసినా పుష్కలంగా గడ్డి లభించేది. ప్రస్తుతం వర్షాలు సక్రమంగా కురవలేదు. దీంతో చెరువులు, బావుల్లో చుక్కనీరు కనిపించడం లేదు. కొండలు, గుట్టలు కాలిబూడిదయ్యాయి. సాధారణంగా ఈ సీజన్‌లో బోరుబావుల్లో పుష్కలంగా నీరు ఉండేది. ప్రస్తుతం అన్నిచోట్లా నీటికి కరువొచ్చి పడింది. దీంతో అరకొరగా పశుగ్రాసం సాగు చేపట్టారు. ఇది ఏమాత్రం పాడిఆవులకు సరిపోవడం లేదు. చేసేదిలేక పాడిరైతులు బయట జిల్లాల నుంచి వరిగడ్డిని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

గతంలో పాడిరైతులకు చేయూత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో పాడిరైతులకు చేయూత నిచ్చి ఆదుకొంది. గతంలో గడ్డికొరత ఏర్పడిన సమయంలో ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో ఎండుగడ్డిని అందించింది.పాడిరైతులకు 25 సెంట్ల నుంచి 2.5 ఎకరాల వరకు గడ్డిని పెంచుకొనేలా చర్యలు తీసుకుంది. పశువైద్యకేంద్రాల ద్వారా పాడిరైతులకు సబ్సిడీపై దాణా అందించారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా పాడిరైతులకు సబ్సీడీపై పచ్చరొట విత్తనాలను సరఫరా చేసి పశుగ్రాసం కొరత రానీయకుండా తగు చర్యలు చేపట్టింది.దీంతో పాడిరైతులు ఎన్నడూ గడ్డికోసం కష్టాలు పడలేదు.



ఖర్చయినా కొనక తప్పదు



ప్రస్తుతం ఎండు వరిగడ్డి ధరలు భగ్గుమంటుంటాయి. పశుపోషణ భారమైంది. ఇంకా మొక్కజొన్నలు, జొన్నలు, ఫీడు, వేరుశనగ పొట్టు ధరలు ఆకాశన్నంటుతున్నాయి. వచ్చే ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా వస్తోంది.అయినా గడ్డి కొనక తప్పడం లేదు.

– నాగరాజ, పాడిరైతు, గంగిరెడ్డిపల్లె

పశుపోషణ భారంగా మారింది



పశుపోషణ భారంగా మారుతోంది. గడ్డికొరత కారణంగా ఎండు గడ్డి కొని ఆవుల్ని పోషిస్తున్నాము. అయినా రోజుకు 5లీటర్లే ఇస్తున్నాయి. దీంతో పాలల్లో వచ్చే రాబడి ఎక్కువ శాతం పశుపోషణకే సరిపోతోంది. మాకు కూలీపాటు డబ్బులు కూడా మిగలడం లేదు.

– నరసమ్మ, పాడిరైతు, మొరంపల్లె

చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాలి



పురావస్తు కట్టడాల ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న రేంజర్ కళావతి

సిద్దవటం: ప్రతి ఒక్కరూ చారిత్రక కట్టడాలను, సంస్కృతి, సంప్రదాయలను పరిరక్షించుకోవాలని ఇంటాక్ జిల్లా కన్వీనర్ డాక్టర్ చిన్నపరెడ్డి తెలిపారు. సిద్దవటంలోని మట్లి రాజుల కోటలో శుక్రవారం ఆర్కిలాజికల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి. సూర్యప్రకాష్ అధ్యక్షతన ప్రపంచ వారసత్వ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ముందుగా పురాతన కట్టడాల ఫొటో ఎగ్జిబిషన్‌ను రేంజర్ కళావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటాక్ జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఇంటాక్ ద్వారా ప్రతి విద్యార్థిని యంగ్ ఇంటాక్‌లో చేర్పించి దేశంలోని వారసత్వ కట్టడాల పరిరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.ఆర్కిలాజికల్ అసిస్టెంట్ సూపరింటెండెంటు సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రాచీన కట్టడాలు, స్మారక చిహ్నాలు , స్థలాలను పరిరక్షించాలన్న ఉద్దేశంతో ప్రతి ఏడాది ఏప్రిల్ 18న ప్రపంచ, వారసత్వ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. సిద్దవటం రేంజర్ కళావతి మాట్లాడుతూ అడవులకు కొందరు నిప్పు పెట్టడం వల్ల వృక్షాలు, పక్షులు, జంతువులు కాలిపోవడంతో పాటు పర్యావరణం దెబ్బతింటోందన్నారు. వీటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. అంతకు ముందు మట్టిరాజుల కోట నుంచి విద్యార్థులు , అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఇంటాక్ సభ్యులు రచించిన చరిత్ర పుస్తకాన్ని సూర్యప్రకాష్ ఆవిష్కరించారు.ఇంటాక్ సభ్యులు రంగనాథ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పి.వెంకట్రామిరెడ్డి,ఓ.వి. రెడ్డి, అసిస్టెంట్‌ఆర్కిలాజికల్ అధికారి కమలాసన్, ఉద్యానశాఖ అస్టెంట్ వెంకటరమణ, జిల్లా పురావస్తు శాఖ అధికారి డాకారెడ్డి, సీ నియర్‌ఫొటోగ్రాఫర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ప్రసంగిస్తున్న ఫాదర్ (రెవరెండ్)శుభకర్

రాయచోటి: గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం జిల్లా పరిధిలోని క్యాథలిక్, ప్రొటెస్టెంట్స్, మిస్సా ప్రార్థన మందిరాలు, లూథరన్, ఇండియన్, పెంతుకొస్తు, యాక్టూస్ తదితర చర్చిల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా జిల్లాలోని అన్ని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మదనపల్లె, రాయచోటి, పీలేరు, రాజంపేట, కోడూరు, బి కోట, తంబళ్లపల్లి ప్రాంతాల్లోని చర్చిల్లో పాస్టర్లు, మతబోధకులు ప్రసంగిస్తూ క్రీస్తుమార్గం అనుసరణీయమని అన్నారు. ఈస్టర్ పండుగకు ముందు వచ్చే శుక్రవారం గుడ్‌ఫ్రైడే జరుపుకుంటామని మత పెద్దలు తెలిపారు.మానవాళి శాంతి కోసం రక్తం చిందించిన ఏసుక్రీస్తు ప్రేమకు ఇది ప్రతీక అన్నారు. ఏసుకు శిలువ వేసిన రోజునే పవిత్ర శుక్రవారంగా జరుపుకుంటామని తెలిపారు. పండుగ సందర్భంగా సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మానవులు చేసిన పాపాలను తను మోస్తూ సిలువపై ప్రాణాలను అర్పించి త్యాగాన్ని చాటిన ఏసును క్రైస్తవులు స్తోత్రాలతో కీర్తించారు.



మదనపల్లెఓని జేసీఎం చర్చిలో భక్తిగీతాలు ఆలపిస్తున్న క్రైస్తవులు

మిథున్‌ను ఎదుర్కోలేక కుట్రలు!

- మూడు పార్టీలు ఏకమైనా ప్రత్యర్థికి తప్పని పరాభవం
- రాజంపేట హ్యాట్రిక్‌గా నిలవడం జీర్ణించుకోవడం లేదు
- తుస్సుమన్న మదనపల్లె ఫైల్స్.. ఆపై తెరపైకి లిక్కర్ స్కామ్ ఆరోపణలు



నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు ఆలకించే ఎంపీ మిథున్‌రెడ్డి (ఫైల్)

మిథున్‌రెడ్డి వరుసగా సాధించిన మెజార్టీ

ఎన్నిక	వచ్చిన ఓట్లు	మెజార్టీ
2014	6,01,752	1,74,762
2019	7,02,211	2,68,284
2024	6,44,844	76,071

బి.కొత్తకోట: రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న ఎంపీ మిథున్‌రెడ్డి విజయ పరంపరకు బ్రేక్ వేయాలని శత విధాలా ప్రయత్నించిన కూటమి నేతలు హ్యాట్రిక్ విజయాన్ని ఆపలేకపోయారు. 2014 నుంచి హేమాహేమీలను ఓడించిన మిథున్‌రెడ్డిని నిలువరించి రాజంపేటలో పాగా వేయలేమని తేలడంతో వేధింపులతో బలహీనపర్చాలన్న కుట్రలను ప్రభుత్వ పెద్దలు తెరపైకి తెస్తున్నారు. మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రమాదంలో ఫైళ్లు కాలిపోతే వారు చేసిన ఆర్భాటం అంతా ఇంత కాదు. చివరకు పాలిగ్రాఫ్ పరీక్షల్లో ఆరోపణలు నిజంకాదని తేలిపోవడం వారికి మింగుడు పడలేదు. మదనపల్లె ఫైల్స్ వ్యవహారం తుస్సుమనడంతో ఇప్పుడు మద్యం కుంభకోణం అంటూ కొత్త ఆరోపణలను ముందుకు తెచ్చారు. ఈ ఆరోపణలతో రాజకీయంగా బలహీనపర్చాలన్న కుతంత్రంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో కూటమి హవా కొనసాగినా రాజంపేట పార్లమెంట్ పరిధిలో కూటమి చతికిలపడటం ఆ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో అధికారంలో ఉన్నాం కాబట్టి అప్రతిష్టకు గురిచేస్తే రాజకీయంగా లాభపడొచ్చన్న అంచనాతో కుయుక్తులతో ప్రభుత్వస్థాయిలో మిథున్‌రెడ్డిపై కుట్రలు పన్నుతున్నారు.

- కూటమి హవాలోనూ రాజంపేట ఎంపీ, మూడు అసెంబ్లీ స్థానాలను కోల్పోవడం వెనుక మిథున్‌రెడ్డి మంత్రాంగమే పనిచేసిందని కూటమి నేతలు మథనపడుతున్నారు. ఇప్పటికే మూడు ఎన్నికల్లో పెద్ద నేతలనే బరిలోకి దింపినా ఓటమి తప్పలేదు. అమ్ములపొదిలోని అస్త్రాలన్నీ వాడేయడం, అవి విఫలం కావడంతో వీరికి మించిన సమర్థులు వచ్చేఎన్నికల్లో లభించడం కష్టమే. దొరికినా మిథున్‌రెడ్డితో తలపడి గెలవడం అంటే ఆషామాషీ కాదు. అయినప్పటికి ఏదో సాధిస్తామన్న ఆశతో తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలతో మిథున్‌రెడ్డిని ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు సాగిస్తున్నారు.
- 2014 ఎన్నికల్లో మిథున్‌రెడ్డి తొలిసారిగా వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసింది పురందేశ్వరితో. టీడీపీ, జనసేనతో ఉన్న పొత్తుతో మూడు పార్టీల అభ్యర్థిగా బీజేపీ తరపున బరిలో నిలిచారు. అయినప్పటికి మిథున్‌రెడ్డి రాజకీయ వ్యూహం, పట్టుదల, ప్రజాభిమానం ముందు మాజీ సీఎం కుమార్తె పురందేశ్వరి ఓటమిపాలవ్వక తప్పలేదు. తొలి విజయంలో 1,74,762 ఓట్ల భారీ మెజార్టీ దక్కింది. ఈ విజయంతోనే మిథున్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణ స్పష్టమైంది. 2019 ఎన్నికల్లో చిత్తూరుకు చెందిన ప్రముఖ నేత డీకే ఆదికేశవులు సతీమణి డీకే సత్యప్రభ టీడీపీ రాజంపేట ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలవగా మిథున్‌రెడ్డి ఆమెను భారీ మెజార్టీతో ఓడించారు. ఊహించని విధంగా 2,68,284 ఓట్ల మెజార్టీ సాధించారు.

మాజీ సీఎంకు తప్పని ఓటమి

2024 ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రానికి చివరి సీఎంగా పని చేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి మూడు పార్టీల కూటమి రాజంపేట ఎంపీ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. కిరణ్ నామినేషన్‌కు ముందు పలుమార్లు సర్వేలు చేయించుకుని బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో గెలవాలని వ్యక్తిగత ఆరోపణలను తెరపైకి తెచ్చారు. అవినీతి, అక్రమాలంటూ సభల్లో ఏకరువు పెట్టారు. చివరకు సొంత నియోజకవర్గం పీలేరులో తమ్ముడు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిశోర్‌కుమార్‌రెడ్డికి వచ్చిన మెజార్టీలో మూడోవంతులో ఒక వంతు కూడా దక్కలేదు. ఎమ్మెల్యే అభ్యర్థికి 25,081 ఓట్ల మెజార్టీ లభిస్తే..అన్న కిరణ్‌కు వచ్చిన మెజార్టీ 6,988 ఓట్లు.

- కూటమి హవాలో రాజంపేట పార్లమెంట్ పరిధిలో వైఎస్సార్‌సీపీ మూడు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంది. తంబళ్లపల్లె,పుంగనూరు, రాజంపేట ఎమ్మెల్యేలుగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి 10,103, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 6,095, ఆకేపాటి అమరనాథరెడ్డి 7,016 ఓట్లతో గెలుపొందారు. రాయచోటిలో విజయం తృటిలో తప్పింది.కేవలం 2,495 ఓట్ల మెజార్టీతో టీడీపీ గెలిచింది. అయినప్పటికీ ఇక్కడ వైఎస్సార్‌సీపీకి అదరణ తగ్గలేదని నిరూపణైంది.

రాజంపేట ఇక దక్కదనే అక్కసు

2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసిన మిథున్‌రెడ్డిని ఓడించాలన్న లక్ష్యంతో మూడు పార్టీలు ఏకమై మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దింపారు. బహింగసభల్లో విమర్శలు, ఆరోపణలతో ప్రాభవం తగ్గించాలని విశ్వప్రయత్నం చేశారు. రాజంపేట రాజకీయాలు తమకు అనుకూలంగా లేకపోతే భవిష్యత్‌లో పార్లమెంట్ సీటుతోపాటు అసెంబ్లీ స్థానాల్లో గెలుపుపైనా ప్రభావం పడి టీడీపీ కోలుకోలేని పరిస్థితి వస్తుందని అంచనా వేసిన నేతలు ఈ ఎన్నికలను కీలకంగా మలుపుతిప్పాలని ప్రయత్నించారు. మాజీ సీఎం కిరణ్ అయితే మిథున్‌రెడ్డిని ఓడిస్తారని కూటమి నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల ప్రచారంలో పెద్దాయన కుటుంబంపై మాటల తూటాలను పేల్చినా అవి ఓట్లుగా మారకపోగా కిరణ్‌కు నష్టం కలిగించాయి. చివరకు కూటమికి ఆశించిన ఫలితం దక్కక ఓటమిని మూటగట్టుకుంది.

గాలివాన బీభత్సం



రామసముద్రం: గుంత ఎంబాడి వద్ద నేలకొరిగిన మొక్కజొన్న పంట



రాజంపేట రూరల్: నేలకొరిగిన అరటితోట



గాలివీడు: రాలిన మామిడి కాయలు

- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- గాలులకు నేలరాలిన మామిడికాయలు

సాక్షి నెట్‌వర్క్: అన్నమయ్య జిల్లాలో శుక్రవారం గాలివాన బీభత్సం సృష్టించింది.ఆకాశమంతా కారుమబ్బులు కమ్మేసి భారీగా ఈదురుగాలులు వీచాయి.గాలులకు చెట్లు, విద్యుత్‌స్తంభాలు, రేకులషెడ్లు కూలిపోయాయి. అక్కడక్కడ వడగళ్లవాన పడింది. కలికిరి-సోమల రోడ్డు గుట్టపాళెం గ్రామం ఈతమాను స్టేజి సమీపంలో గాలుల బీభత్సానికి చెట్టు రోడ్డుపై పడింది. ఆ సమయంలో వాహనదారులు లేక పోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. సోమల మార్గంలో వాహనాల రాకపోకలు సుమారు రెండు గంటల పాటు స్తంభించిపోయాయి. స్థానికుల సమాచారంతో స్పందించిన సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి తన సిబ్బంది, స్థానికుల సాయంతో రాకపోకలను పునరుద్ధరించారు. గాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. గాలివీడులో పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద విద్యుత్ ఫోల్ ఒక పక్కకు ఒరిగింది .దీంతో పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కదిరి-రాయచోటి ప్రధాన రహదారి పెట్రోల్ బంక్ వద్ద చెట్టు కొమ్మలు విరిగి రహదారికి అడ్డుగా పడ్డాయి.దీంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలులకు మామిడికాయలు నేలరాలాయి. నూలివీడు, పూలుకుంట, అరవీడు, వెలిగల్లు, ఎగువగొట్టివీడు గ్రామాల్లో మామిడి రైతులకు నష్టం వాటిల్లింది. బి.కొత్తకోట మండలంలో పెనుగాలులకు పంటలు దెబ్బతిన్నాయి. గుమ్మసముద్రం పంచాయతీ అచ్చమ్మకోటకు చెందిన రైతు టి.సుధాకర్ సాగుచేసిన రెండెకరాల మొక్కజొన్న పంట నేలకూలింది. నిరుపేద మహిళ బి.రామలక్ష్మమ్మ ఇంటిపై కప్పు రేకులు గాలికి ఎగిరిపోయాయి. పెద్ద తిప్పసముద్రం మండలం టి సదుం పంచాయతీలోని పలు గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది.



కలికిరి: రోడ్డుపై విరిగిపడిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు, స్థానికులు

నేలకొరిగిన పంటలు

రామసముద్రం మండలం అరికెల, కేసీ.పల్లె, మాలేనత్తం, మానేవారిపల్లె పంచాయతీ పరిధిలో గాలులకు టమాటా, మొక్కజొన్న, కొత్తిమీర, మస్కిమెలన్, బీన్స్ పంటలు నేలకొరిగాయి. మామిడికాయలు సైతం రాలిపోవడంతో రైతులు నష్టపోయారు.

- ఒంటిమిట్ట మండలం చింతరాజుపల్లి పంచాయతీ పరిధిలోని పత్రపల్లి గ్రామ పొలాల్లో వేసిన అరటి, బొప్పాయి పంటలు శుక్రవారం వీచిన ఈదురు గాలులు, వడగండ్ల వర్షానికి నేలకొరిగాయి. పత్రపల్లిలోని బొడ్డే శ్రీనివాసులకు చెందిన ఆరు ఎకరాల్లో, గొల్ల రామయ్య, ఓబులేశు, అప్పన్నగారి లక్ష్మయ్యకు చెందిన మూడు ఎక రాల్లో అరటిపంట దెబ్బతింది. ఓబులేశుకు చెందిన మూడు ఎకరాల బొప్పాయి పంట కూడా పూర్తిగా దెబ్బతింది.
- రాజంపేట మండలంలో 106 మంది రైతులకు చెందిన 225 ఎకరాల్లో అరటిపంట నేలకొరిగింది. రూ. 2.25 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు ఉద్యాన అధికారులు అంచనా వేస్తున్నారు. మండల పరిధిలోని మిట్టమీదపల్లి, కొల్లావారిపల్లి, లక్ష్మింపల్లి, మేకావారిపల్లి, చవనవారీపల్లి, వరదయ్యగారిపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో అరటి నేలకొరగడంతో రైతులు నష్టపోయారు.

క్లుప్తంగా

అప్పులిచ్చిన వారికి ఐపీ నోటీసులు

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామంలో ఓ వ్యాపారస్థుడు ఐపీ పెట్టడంతో అప్పులు ఇచ్చిన వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యాపారులు ఉన్నట్లుండి ఐపీ నోటీసులకు కోర్టు ద్వారా పంపించడంతో బాధితులందరూ శుక్రవారం ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌కు చేరి తమకు న్యాయం చేయాలంటూ పోలీసుల ముందు వాపోయారు. చిలంకూరు గ్రామంలో నమ్మకంగా ఉన్న వ్యాపారస్థుడు ప్రజల వద్ద నుంచి అధిక వడ్డీకి దాదాపు మూడు కోట్లకుపైగా అప్పుగా తీసుకున్నాడు. దానిని చెల్లించలేని పరిస్థితి అప్పులు ఇచ్చిన వారికి కోర్టు ద్వారా ఐపీ నోటీసులు ఇవ్వడంతో బాధితులు ఒక్కసారిగా అవాక్కైపోతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



బద్వేలు అర్బన్ : పట్టణంలోని సిద్దవటం రోడ్డులోని లైఫ్‌స్టైల్ రెడీమేడ్స్ పక్క సందులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ పంచనామా నిర్వహించగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తించినట్లెతై అర్బన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

కారు ప్రమాదంలో యువకుడు మృతి

– ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన కారు



వెంకట సాయి(ఫైల్)

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం సమీపంలోని నిడివెల్ల గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన కారు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపురంలోని బంధువుల ఇంటికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా సింహాద్రిపురం మండలం నిడివెల్ల గ్రామ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి బోల్తా పడిందన్నారు. ప్రమాదంలో యువకుడు వెంకటసాయి మృతి చెందగా, మణిదీప్, శివచంద్ర, వేణులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించామన్నారు. గాయపడ్డ వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

లారీని ఆపబోయి కారు డ్రైవర్‌కు గాయాలు

కొండాపురం : మండల పరిధిలోని ముచ్చుమర్రి గ్రామ సమీపంలోని తాడిపత్రి- ముద్దనూరు ఎన్‌హెచ్-67 రోడ్డుపై శుక్రవారం కొండాపురం గ్రామానికి బోడోల్ల పెద్దన్న ద్విచక్ర వాహనంపై వెళుతుండగా లారీ కంటైనర్ ఢీ కొని వెళ్లిపోతోంది. దీనిని వెనుక వస్తున్న కారు డ్రైవర్ గమనించి లారీని ఆపడం కోసం ప్రయత్నించి గాయలపాలయ్యాడు. కడప వైపు నుంచి తాడిపత్రి వైపునకు వెళ్తున్న కారు డ్రైవర్ పసుపులేటి రమణరెడ్డి లారీ కంటైనర్ ఆపడానికి ప్రయత్నించగా పి. అనంతపురం సమీపలోని కణం వద్ద ఉన్న ఎస్సీ కాలనీ దగ్గర కారును లారీ కంటైనర్ ఢీ కొట్టడంతో కారు పల్టీ కొట్టింది. ప్రమాదంలో కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పొన్నూటిపాళ్యంలో టెన్షన్..టెన్షన్

- ఉదయాన్నే గ్రామాన్ని చుట్టుముట్టిన పోలీసులు, ఫారెస్ట్ అధికారులు
- ఉచ్చు వేసిన ప్రాంతం పరిశీలనకు ఫారెస్ట్ ఉన్నతాధికారుల రాక
- అమాయక రైతులను అరెస్ట్ చేశారంటూ గ్రామస్తుల ఆవేదన
- ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యంతోనే చిరుత చనిపోయిందంటూ ఆగ్రహం
- అధికారులను అడ్డుకుని నిరసన తెలిపిన గ్రామస్తులు



అమాయక రైతులను అరెస్ట్ చేశారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగిన పొన్నూటిపాళ్యం గ్రామస్తులు



అడవిలో చిరుత మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ ఉన్నతాధికారుల బృందం

మదనపల్లె : వేటగాళ్ల ఉచ్చులో చిరుతపులి మృతి చెందిన ఘటనపై రాష్ట్రప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో...శుక్రవారం ఉదయం మదనపల్లె మండలం పొన్నూటిపాళ్యం గ్రామంలో టెన్షన్ నెలకొంది. అడవిలో ఉచ్చువేసి చిరుత మృతికి కారకులయ్యారంటూ గురువారం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను ఫారెస్ట్ అధికారులు అరెస్ట్ చేయడం, శుక్రవారం ఉదయాన్నే గ్రామాన్ని పోలీసులు, ఫారెస్ట్ అధికారులు చుట్టుముట్టడంతో గ్రామస్తుల్లో భయాందోళన నెలకుంది. చిరుతపులి మృతి ఘటనలో ఫారెస్ట్ అధికారులు గ్రామస్తుల్లో మరికొందరిని అరెస్ట్ చేస్తారన్న సమాచారం తెలియడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. చిరుతమృతికి కారణాలను పరిశీలించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పొన్నూటిపాళ్యం చేరుకున్న ఏపీ పీసీసీఎఫ్ చలపతిరావు, డీఎఫ్ఓ జగన్నాథసింగ్, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, తిరుపతి సర్కిల్ ఎస్.సెల్వం తదితరులు నేరుగా అడవిలోకి వెళ్లారు. చిరుత మృతి చెందిన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, కారణాలను అంచనా వేశారు. అనంతరం తిరిగి మదనపల్లెకు వస్తుండగా, పొన్నూటిపాళ్యం గ్రామస్తులు అధికారుల వాహనాలను అడ్డుకున్నారు. చిరుతపులి ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యంతో, 8 గంటల సేపు నరకయాతన అనుభవించి, అధికారుల కళ్ల ముందే చనిపోయిందన్నారు. కాపాడే అవకాశాలున్నప్పటికీ, అధికారులు కాలయాపన చేస్తూ చిరుత చావుకు కారకులయ్యారని చెప్పుకొచ్చారు. గన్ పనిచేయకపోవడం, సరైన ఎక్విప్‌మెంట్, అనుభవం కలిగిన సిబ్బంది లేకపోవడంతోనే చిరుతపులిని అధికారులు కాపాడలేకపోయారన్నారు. ఈ ఘటనలో అధికారులు తమ వైఫల్యాలను చెప్పుకోకుండా, అమాయక రైతులను కేసులో ఇరికించి తప్పించుకోవాలని చూస్తున్నారన్నారు. పులిని చంపేంత ధైర్యం గ్రామస్తులకు లేదని, రైతులను విచారణ పేరుతో తీసుకెళ్లి అరెస్ట్ చేసి, అప్పటికప్పుడే రిమాండ్‌కు ఎలా పంపుతారని నిలదీశారు. ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్న కే.రెడ్డెప్పరెడ్డి, వెంకటరమణారెడ్డి, డి.గంగాధరకు ఘటనతో ఎలాంటి సంబంధం లేదన్నారు. డిప్యూటీ సీఎం, అటవీ పర్యావరణశాఖమంత్రి పవన్‌కల్యాణ్ అమాయకుల్ని కాపాడండంటూ నినాదాలు చేశారు. దీంతో పీసీసీఎఫ్ చలపతిరావు, గ్రామస్తులతో మాట్లాడుతూ..ప్రజల వినతిని రాతపూర్వకంగా మదనపల్లె ఫారెస్ట్ కార్యాలయానికి తెచ్చి ఇవ్వాల్సిందిగా చెప్పడంతో గ్రామస్తులు నిరసన విరమించారు. అనంతరం ఫారెస్ట్ కార్యాలయంలో, ఘటనకు, పొన్నూటిపాలెం గ్రామస్తులకు సంబంధం లేదని, అమాయకులను విడిచిపెట్టాల్సిందిగా కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కేసును త్వరగా పరిష్కరించాలనే ఆతృతతో నిష్కారణంగా రైతులను బలిచేస్తున్నారన్నారు. పులి ఫారెస్ట్ ఏరియాలోని ఉచ్చులో తగులుకుంటే అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, విచారణ కోసం తీసుకువచ్చి 24గంటల్లోపు అరెస్టేచేసి రిమాండ్‌కు పంపేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయక రైతులను విడిచిపెట్టి, అసలు దోషులను శిక్షించాల్సిందిగా కోరారు.

సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందాం



తిమ్మక్కగారిపల్లెలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : సమష్టి కృషితో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసుకుందామని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పంచాయతీ తిమ్మక్కగారిపల్లెలో మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి నివాసంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ అవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న పాలనలో శెట్టిపల్లె గ్రామం అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా దాదాపు రూ. 60 కోట్లకు పైగా నిధులు వచ్చాయని శ్రీకాంత్‌రెడ్డి ఎదుట నాయకులు గుర్తు చేసుకున్నారు. అనంతరం మాజీ కోఆప్షన్ జాఫర్‌ఖాన్ కుమారుడి వివాహ వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమంలో అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగారెడ్డి, ఆనంద్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, మాధవ్, శివయ్య, నౌషాద్, సయ్యద్, సమీర్, మహేశ్వర, శంకర్, శివయ్య తదితరలు పాల్గొన్నారు.

బీజేపీవి కక్ష సాధింపు చర్యలు

ఏపీసీసీ కార్యవర్గ సభ్యులు అత్తింజేరీ శ్రీనాథ్



కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడుతున్న శ్రీనాథ్

రాజంపేట రూరల్ : కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలపై రాజకీయ కుట్రలో భాగంగా బీజేపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గమని ఏపీసీసీ కార్యవర్గ సభ్యులు అత్తింజేరీ శ్రీనాథ్ ఆరోపించారు. స్థానిక ఆర్అండ్‌బీలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ ఎదుగుదలను జీర్ణించుకోలేక ప్రధాని మోదీ దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలను సొంత ఏజెన్సీలుగా వాడుకొంటూ అక్రమ కేసులు నమోదు చేయిస్తోందని మండిపడ్డారు. దేశంలో బీజేపీ చేస్తున్న అరచకాలను ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ గొంతు నొక్కాలని కుట్రలు చేయటం సబబు కాదని హితబోధ చేశారు. మనీనే లేని కేసులో మనీ ల్యాండరింగ్ జరిగిందని ఆరోపణలు చేయటం అత్యంత దారుణమని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ చేస్తున్న నీచ రాజకీయాలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. మోదీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ మీద చార్జ్ షీట్ వేయటం కాదు ప్రజలే బీజేపీ మీద చార్జ్‌షీట్ వేసే రోజులు దగ్గరపడ్డాయని గుర్తు చేశారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి లింగం నాగేశ్వరరావు, డీసీసీఅ ధికార ప్రతినిధి అహమ్మద్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, వేంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంతో నారాయణరెడ్డికి ఎలాంటి సంబంధం లేదు

- ఆయనకు ప్రాథమిక సభ్యత్వం కూడా లేదు
- సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



మీడియాతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

కడప సెవెన్‌రోడ్స్ : తమ పార్టీతో బి.నారాయణరెడ్డికి ఎలాంటి సంబంధం లేదని, 2023 నుంచి ఆయనకు పార్టీ ప్రాథమిక సభ్యత్వం కూడా లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ స్పష్టం చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తమ పార్టీ జిల్లా కమిటీ తీర్మానాన్ని వివరించారు. ఈనెల 3, 18 తేదీల్లో నారాయణరెడ్డి , ఆయన కుటుంబ సభ్యుల భూ కబ్జాలపై పత్రికల్లో కథనాలు ప్రచురించారని, అయితే తమ పార్టీతో అతడికి ఎలాంటి సంబంధం లేన్నారు. సీపీఎం పద్ధతులకు భిన్నంగా వ్యవహరించిన తమ పార్టీ జిల్లా కార్యదర్శులను, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులను, జిల్లా కమిటీ సభ్యులను, పూర్తి కాలపు కార్యకర్తలను బహిష్కరించిన ఉదంతాలు గతంలో చాలా ఉన్నాయని పేర్కొన్నారు. చెమ్ముమియాపేట గ్రామ సర్వే నెంబరు 344లోని స్థలాన్ని మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ బాడీలో 2017లో తమ పార్టీ విజ్ఞప్తి మేరకు సుందరయ్య స్మారక కేంద్రం లైబ్రరీకి కేటాయిస్తూ తీర్మానం చేశారని పేర్కొన్నారు. సదరు స్థలాన్ని కబ్జాకోరులు ఆక్రయించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసిన వెంటనే ఈ విషయాన్ని ఈనెల 2వ తేది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రాతపూర్వక ఫిర్యాదు ఇచ్చామన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం వల్ల ఆ స్థలంలో కార్పొరేషన్ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. భగత్‌సింగ్ కాలనీలోని కమ్యూనిటీ స్థలాన్ని అధికారులు, స్థానిక ప్రజల అభీష్టం మేరకు కమ్యూనిటీ లైబ్రరీగా మార్చాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. నారాయణరెడ్డికిగానీ, వారి కుటుంబ సభ్యులకుగానీ పట్టా ఎలా వచ్చిందో విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. నారాయణరెడ్డి భూ కబ్జాలపై ఏవైనా కథనాలు రాసేవారు తమ పార్టీ పేరు ఉపయోగించరాదని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, ఎ.రామ్మోహన్, వి.అన్వేష్‌తోపాటు దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల మాయంపై ఏసీబీ కేసు

15మంది అటవీశాఖ అధికారులపై విచారణకు ఆదేశం

కడప అర్బన్/ మైదుకూరు : మైదుకూరు పరిధిలో వనిపెంట అటవీ రేంజ్ గోడౌన్ నుంచి 1037 కిలోల 37దుంగలు మాయమయ్యాయి. ఎర్రచందనం దుంగలు మాయమైన ఘటనపై 2021 జనవరి 29న 15 మంది అటవీశాఖ అధికారులపై కేసు నమోదు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. 15 మంది అటవీశాఖ అధికారులు, సిబ్బందిని బాధ్యులుగా నిర్ధారించారు. తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి ఏసీబి వారు నివేదికను సమర్పించారు. ఏసీబి వారి నివేదికను ప్రభుత్వం పరిశీలించింది. ఈ సంఘటనపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. బాధ్యులైన అధికారులు, సిబ్బంది విచారణ ప్రారంభమయ్యేలోగా సంజాయిషి ఇచ్చుకునే అవకాశం కల్పిస్తూ విడివిడిగా నోటీసులు జారీ చేశారు. బాధ్యుల్లో రిటైర్డ్ ఉద్యోగులపై పెన్షన్ రూల్స్ మేరకు విచారణ జరుపనున్నారు. విచారణలో అప్పటి వనిపెంట అటవీ రేంజర్ సిహెచ్ దినేష్ కుమార్ రెడ్డి, ప్రొద్దుటూరు వైల్డ్ లైఫ్ డీఎఫ్ఓ నాగార్జున రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఆఫీసర్ విజ్ఞత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లను కేసులో అధికారులు పొందుపరిచారు. ఈమేరకు రాష్ట్ర పర్యావరణ అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము ఆ మేరకు 22 జీవోలను విడివిడిగా జారీ చేశారు. మైదుకూరు మండలం వనిపెంట అటవీ రేంజి కార్యాలయంలో 2021 జనవరి 29న ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. కాగా వనిపెంట రేంజి కార్యాలయంలో నిల్వ ఉంచిన 49 ఎరచ్రందనం దుంగలు మాయమయ్యాయని.. దానిపై ఏసీబీ అప్పటి డిఎఫ్ఓ, ఎఫ్ఆర్ఓ, సెక్షన్ అధికారులు, సిబ్బంది మొత్తం 15 మంది పై అభియోగాలు నమోదు చేసిందని సమాచారం. ఈ విషయంపై శుక్రవారం వనిపెంట రేంజ్ అధికారి ప్రణీతరావును వివరణ కోరగా అటవీ అధికారులపై అభియోగాలు నమోదు చేసేందుకు ఏసీబీ రంగం సిద్ధం చేసినట్లు తమకు తెలిసిందన్నారు. అయితే అధికారికంగా వెల్లడి చేయలేదని పేర్కొన్నారు. కాగా వనిపెంట రేంజి కార్యాలయంలో ఎరచ్రందనం దుంగలు 2018కి ముందే మాయమైనట్లు గుర్తించారని తెలిపారు. దానిపై విచారణ కూడా జరిగిందన్నారు. ఏసీబీ అధికారులు 2021లో రేంజి కార్యాలయంలో సోదాలు నిర్వహించిన సమయంలో కూడా దుంగలు మాయమైన విషయం గురించిన రికార్డులను పరిశీలించారని పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం



ముస్కార్ తార (ఫైల్)

రాజంపేట : ఎర్రబల్లిలో నివాసం ఉంటున్న సయ్యద్ ముస్కార్ తార (18) అనే బాలికకు మతిస్థిమితం సరిలేక అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు శుక్రనవారం పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఈనెల 10వ తేది రాత్రి నుంచి కనబడుట లేదని, తమ కుమార్తె ఆచూకీ తెలిసిన వారు 9121100573, 9133817996 నెంబర్లకు సమాచారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మోటార్లను పగులకొట్టి కాపర్ వైరు చోరీ

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని దిన్నెపాడు పంచాయతీలోని పర్వతరెడ్డిగారిపల్లి, దిన్నెపాడులో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ వైరు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. నారాయణ రెడ్డి, షేక్ కరీమ్, శివారెడ్డి, కాలేషా, ఇమాములు బాషతోపాటు మరో ఇద్దరు రైతుల మోటార్లను బయటకు తీసి పగులకొట్టి అందులో ఉన్న కాపర్ వైర్లు ఎత్తుకెళ్లారని బాధితులు వాపోయారు. అసలే ఎండాకాలం బోర్లలో అరకొర నీటితో పంటలు సాగు చేసుకుంటున్న ఈ తరుణంలో దొంగలు మోటార్లను పగులకొట్టి కాపర్ వైరు తీసుకెళ్లడంతో ఇబ్బందులు తప్పలేదన్నారు. లక్కిరెడ్డిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

కారు, స్కూటర్ ఢీ

– స్కూటరిస్టు మృతి



ఇరగంరెడ్డి (ఫైల్)

రామాపురం : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా శుక్రవారం కారు, స్కూటర్ ఢీ కొని పప్పిరెడ్డి ఇరగంరెడ్డి (50) మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా.. మండలంలోని హసనాపురం పంచాయితీ గొల్లపల్లికి చెందిన పప్పిరెడ్డి ఇరగంరెడ్డి రామాపురంకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా పోలీస్ స్టేషన్ సమీపానికి రాగానే కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు స్కూటర్ ఢీ కొంది. ఇరగంరెడ్డి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మండల పోలీసులు తెలిపారు.

ఇరగంరెడ్డి మృతికి నివాళి : పప్పిరెడ్డి ఇరగంరెడడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇరగంరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకంటామన్నారు.

గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎంపిక



గంప రెడ్డిప్రసాద్

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామం బీసీకాలనీకి చెందిన గంప నాగేంద్ర కుమారుడు గంపరెడ్డిప్రసాద్ గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో నిర్వహించిన కబడ్డీ సెలక్షన్‌లో గంప రెడ్డిప్రసాద్ తనదైన ప్రతిభను కనబరచడంతో ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎన్నికయ్యాడు. హర్యానా రాష్ట్రంలో ప్రపంచదేశాల నుంచి వచ్చే ప్రతినిధులతో కబడ్డీ నిర్వహించనున్నారు. గంపరెడ్డిప్రసాద్ ఎంపికపై కుటుంబ సభ్యులు, మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

పిడుగుపాటుకు పాడిఆవు మృతి



మృతిచెందిన పాడిఆవును చూపుతున్న రైతు

కలకడ : మండలంలో పిడుగుపడి పాడిఆవు మృతి చెందింది. కలకడ మండలం ఎనుగొండపాళ్యెం పంచాయతీ ఇంటిళ్ళువారిపల్లెకు చెందిన వెంకటేశ్వరనాయుడు పాడిఆవు మేత కోసం పంటపొలంలో ఉండగా శుక్రవారం సాయంత్రం కురిసిన గాలివానకు ఉరుములు మెరుపులతో పిడుగు పడింది. చెట్టుసమీపంలో మేత మేస్తున్న ఆవుపై పిడుగు పడటంతో పాడిఆవు అక్కడికి అక్కడే మృతి చెందింది. పాలదిగుబడితో కుటుంబాన్ని పోషించుకుంటూ రూ.లక్ష అప్పుచేసి కొనుగోలు చేసిన పాడి ఆవు మృతిచెందడంతో కుటుంబ జీవనాధారం కోల్పోయానని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో అగ్నిప్రమాదం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక హౌసింగ్‌బోర్డులోని భగత్ సింగ్ కాలనీలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో బ్యాంక్ క్యాబిన్‌తో పాటు కంప్యూటర్, కౌంటింగ్ మిషన్, ఫ్యాన్, కొన్ని ఫైళ్లు కాలిపోయాయి. శుక్రవారం సెలవు కావడంతో బ్యాంక్ తెరవలేదు. ఈ క్రమంలో రాత్రి బ్యాంక్‌లో నుంచి పొగలు రావడంతో స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది బ్యాంక్ వద్దకు చేరుకొని మంటలను ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. టూ టౌన్ సీఐ సదాశివయ్య, ఎస్ఐ రాఘవేంద్రారెడ్డిలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం గురించి అగ్నిమాపక అధికారితో మాట్లాడారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు



నాటుసారా స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

పెద్దమండ్యం : తండాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూధనరావు హెచ్చరించారు. మండలంలోని ముసలికుంట పంచాయతీ దామ్లానాయక్‌తండాలో శుక్రవారం నాటుసారా తయారీ, విక్రయాలపై అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. ఓ పాడుబడిన ఇంటిలో నిలువ ఉన్న నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు ఎవరనేది విచారిస్తున్నట్లు చెప్పారు. అలాగే తండాలో మరో వ్యక్తి వద్ద ఉన్న 5 లీటర్ల నాటుసారా, 5 కేజీల బెల్లం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అనంతరం తండా వాసులతో ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. సారాను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. నాటుసారా తయారీ, విక్రయాలతో జరుగుతున్న అనర్థాల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న కార్పొరేషన్ రుణాలు, ఇండస్ట్రియల్ ద్వారా అందిస్తున్న రుణాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ ౘైర్మన్లకు గన్‌మెన్లను తొలగించడం దారుణం

జిల్లా పరిషత్ చైర్మన్ ఎం. రామగోవిందరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి తదితరులు

వేంపల్లె : రాష్ట్రవ్యాప్తంగా జెడ్పీ చైర్మన్లకు గన్‌మెన్లను తొలగించడం దారుణమని జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా వర్షాలు కురవక తాగునీటి సమస్య అధికంగా ఉందని, వచ్చే జెడ్పీ నిధులతో ఎక్కడా కూడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మే 8న జెడ్పీ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో కలెక్టర్‌తో చర్చించి మొదటి ప్రాధాన్యతగా తాగునీటికి ఇవ్వనున్నామని, గత సమావేశాలలో కూటమి ఎమ్మెల్యేలు హాజరై జిల్లాలోని అనేక సమస్యలపై చర్చించకుండా గైర్హాజరు కావడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యంగా పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట, వేంపల్లె, సింహాద్రిపురం, లింగాల తదితర మండలాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.16కోట్లను వేసవికాలంలో తాగునీటికి వినియోగిస్తామని తెలిపారు. ఇప్పటికే వివిధ రకాల పనులకు సంబంధించి రూ.6.కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో గాంధీజీ కలలు కన్నా స్వరాజ్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాపరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్ కుమార్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, శ్రీనివాసులు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వివాహిత విజ్ఞప్తి

- భర్తను విదేశాలకు పంపి, తనను పుట్టింటిలో వదిలేశారు
- ఆడపడుచు వివాహానికి అదనపు కట్నం తీసుకురమ్మంటున్నారు
- వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినా చర్యలు లేవు

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అల్మాస్‌పేటలో నివాసం ఉంటున్న దౌజీ జమీల్‌ఖాన్ కుమార్తె ఆసియఖానమ్ తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బాధితురాలు కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. తనకు కడప నగరంలోని ఖాన్ జ్యువెలరీ యజమాని షర్వానీ షబ్బీర్ అహ్మద్‌ఖాన్ కుమారుడు షర్వానీ ఫైరోజ్‌ఖాన్‌తో 2022 అక్టోబర్ 2వ తేదీన పెద్దల సమక్షంలో వివాహం చేశారు. వివాహ సమయంలో 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షలు కట్నంగా ఇచ్చారు. తరువాత విడతల వారీగా డబ్బులను, బంగారు ఆభరణాలను, తన తండ్రి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని భూమిని తన పేరుతో రాయించుకుని రమ్మని వేధిస్తున్నారని వాపోయింది. వివాహమైన రెండు నెలలకే తన భర్తను విదేశాలకు పంపించేశారు. గత ఏడాది ఏప్రిల్ 15న పుట్టింటిలో తనను వదిలేసి వెళ్లిపోయాడని, ఫోన్‌లోనే తన ఆడబిడ్డకు వివాహం కుదిరిందని, ఆమె వివాహానికి కూడా తన తల్లిదండ్రుల దగ్గరి నుంచి 50 తులాల బంగారు ఆభరణాలను, 20 లక్షల రూపాయలను అదనంగా తీసుకురమ్మని వేధిస్తున్నారని చెప్పింది. గత ఏడాది అక్టోబర్ 29న కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో తన భర్త, అత్తామామ, ఆడబిడ్డపై కేసు నమోదు చేశారు. కానీ తనకు ఎలాంటి న్యాయం జరుగలేదన్నారు. వివాహాలను చేసుకుని భార్యను పుట్టింటిలోనే వదిలేసి విదేశాలకు వెళ్లిపోతున్న ఇలాంటి వారిపై ఎలాంటి చర్యలను తీసుకుంటారో, తనకు న్యాయం జరిగేలా చూడాలంది. తనలాగా ఏ ఆడపిల్లకు అన్యాయం జరగకూడదని వేడుకుంది.